

రూ. లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం కర్నూలుకు చెందిన డాక్టర్ బట్టు మల్లేశ్వర రెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు.



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన జి.సాంబశివరావు రూ.1,00,116 విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,617.91
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 55.660
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,396

పారదర్శక పాలన

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత
- సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు
- విద్య, వైద్యానికి పెద్దపీట
- అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు
- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- ఉత్తమ అధికారులకు అవార్డుల ప్రదానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రెపరెపలాడిన మువ్వెన్నల జెండాలు దేశభక్తిని పెంపొందించగా.. సాయుధ బలగాల కవాతు ధైర్యాన్ని నింపగా.. స్వాతంత్ర్య సమరయోధుల స్మరణ స్ఫూర్తి కలిగించగా.. కలెక్టర్ ప్రసంగం జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించగా.. నవరత్నాలు పొదిగిన శకటాల ప్రదర్శన నవశకానికి దారి చూపగా.. విద్యార్థుల నృత్యాలు దేశ సంస్కృతిని ప్రతిబింబించగా.. గణతంత్ర దినోత్సవ వేడుకలు నంద్యాల పట్టణంలో కనులపండువగా సాగాయి.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి



"'పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ ద్వారా గతంలో ఒక కుటుంబానికి ఉన్న రెండు లక్షల రూపాయల పరిమితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 5 లక్షలకు పెంచారు. ఆరోగ్యశ్రీలో 2,446 వ్యాధులకు ఉచితంగా వైద్యం అందుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు రూ. 338 కోట్లు ఖర్చు చేసి 1.49 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందజేశాం. నంద్యాలలో 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో నూతన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా ఆసుపత్రిని అభివృద్ధి చేసి మెడికల్ కళాశాలకు అనుసంధానం చేయనున్నాం'."

– కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

అభివృద్ధి పరుగులు

జిల్లాలో రూ.360 కోట్లతో 496 కి.మీ 64 రహదారుల నిర్మాణాలు పూర్తి చేశాం. పట్టణంలోని బొమ్మలసత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు 2.5 కి.మీల రోడ్డును 4 లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.13 కోట్లు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.166 కోట్ల అంచనాతో చేపట్టిన 414 గ్రామ సచివాలయ భవనాలలో 192 పూర్తయ్యాయి. రూ.86 కోట్ల అంచనాలతో చేపట్టిన 393 రైతు భరోసా కేంద్రాలలో 92 పూర్తయినవి. రూ.48 కోట్ల అంచనాతో చేపట్టిన 272 వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లలో 30 పూర్తయినవి. రూ.4,769 కోట్ల పెట్టుబడితో 9 భారీ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 5,700 మందికి ఉపాధి కల్పిస్తున్నాం. జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.86.30 కోట్లు పెట్టుబడితో 1,674 సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి 5,360 మందికి ఉపాధి కల్పించాం.





దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రగతి వెలుగులు

జిల్లాలో 259 జగనన్న లేఅవుట్లలో 49,170 గృహాలను మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఖర్చు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా గృహ నిర్మాణాల కోసం రూ.283.25 కోట్లు ఖర్చు చేశాం. 53 జగనన్న హౌసింగ్ కాలనీల్లో నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, అంతర్గత రహదారులకు రూ.4.39 కోట్లు ఖర్చు చేశాం. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించే ఉద్దేశంతో జిల్లాలో 6,870 మంది గ్రామ వలంటీర్లు, 1,891 మంది వార్డు వలంటీర్లు సేవలందిస్తున్నారు. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 107 వార్డు సచివాలయాల్లో 5,580 మంది ఫంక్షనల్ కార్యదర్శులు పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని శాసనసభ్యులు సచివాలయాల వారీగా ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలపై దృష్టి సారించారు. ప్రాధాన్యత సమస్యల పరిష్కారం కోసం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నాం. జిల్లాలోని 2,83,226 మంది అసంఘటిత కార్మికులను ఇప్పటి వరకు ఈ-శ్రామ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసి గుర్తింపు కార్డులు ఇచ్చాం.

నంద్యాల: అందరి సహకారంతో నూతన జిల్లా నంద్యాలను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, తొగురు ఆర్థర్, మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు హబీబుల్లా, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, వడ్డె ఓబన్న, ఖాదరబాదర నర్సింగరావు, బొల్లవరపు వెంకటసుబ్బారెడ్డిల కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతిపై కలెక్టర్ సందేశాన్ని వినిపించారు.

'రైతు సంక్షేమమే ధ్యేయం..

వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 2022-23లో 2.40 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.344 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. 2021-22లో సున్నా వడ్డీ పంట రుణాల కింద లబ్ధి పొంది సకాలంలో రుణాలు చెల్లించిన 81,294 మంది రైతులకు రూ.16.24 కోట్లు వడ్డీని మాఫీ చేశాం. ఈ రబీలో పంట రుణాల కింద 1,42,852 మంది రైతులకు రూ.2,238 కోట్లు బ్యాంకుల ద్వారా అందించాం. వ్యవసాయానికి రైతులకు పగటిపూటే 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున సంచార పశు వైద్య వాహనాల ద్వారా 5,485 పశువులకు రైతుల ఇంటి వద్దనే వైద్య సేవలు ఉచితంగా అందించాం. అలాగే రూ.1,758 కోట్లతో గాలేరు నగరి విస్తర్ణ పనులు చకచకా సాగుతున్నాయి. కుందూనదిపై రాజోలి, జోళదరాశి మినీ రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.313 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి.

ఆర్థిక భరోసా..

వృద్ధాప్యంలోని అవ్వా, తాతలకు ఆసరాగా నిలిచేందుకు ప్రతి నెల 1వ తేదీన వైఎస్సార్ ఆసరా పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. వృద్ధులతో పాటు వితంతువు, ఒంటరి మహిళ, చేనేత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఈఆర్టీ పెన్షన్‌దారులకు నెలకు రూ.2,750 ప్రకారం జనవరిలో నెలలో 2.19 లక్షల మందికి దాదాపు రూ.60.44 కోట్లు పంపిణీ చేశాం. అలాగే స్వయం సహాయక మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు బ్యాంక్ లింకేజీ కింద 24,900 సంఘాలకు రూ.920 కోట్లు పంపిణీ చేశాం. ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాలు అందిస్తున్నాం. వైయస్సార్ చేయూత కింద జిల్లాలో అర్హులైన 94,989 మందికి రూ.178 కోట్లు అందజేశాం.

భవిష్యత్‌కు పునాది

నాడు-నేడు మన బడి కింద జిల్లాలో మొదటి దశలో 486 ప్రభుత్వ పాఠశాలలను అత్యంత సుందరంగా ఆధునికీకరించి మెరుగైన సదుపాయాలు కల్పించాం. ప్రస్తుతం రెండవ దశలో రూ.316 కోట్లతో 981 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. జగనన్న అమ్మ ఒడి' పథకం కింద 2021-22 విద్యా సంవత్సరానికి ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున జిల్లాలో అర్హత ఉన్న 1.72 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.224 కోట్ల రూపాయలు జమ చేశాం. వరుసగా మూడో ఏడాది 1.85 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందజేశాం. జగనన్న విద్యాదీవెన కింద జిల్లాలో ఇప్పటి వరకు 46,422 మందికి రూ.104 కోట్లు 40,356 విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేశాం.



వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ మనజీర్, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, ఆర్థర్, శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీసుల కవాతు



గిరిజన నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



ప్రథమ బహుమతి అందుకున్న గ్రామీణ నీటి సరఫరా శాఖ శకటం





మూడో బహుమతిని సంయుక్తంగా అందుకున్న గృహ నిర్మాణ శకటం, డీఆర్‌డీఏ శకటం



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

న్యూస్‌రీల్

రూ. 6,399 కోట్లతో భవన నిర్మాణాలు



రహదారిని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ సీఈ కృష్ణారెడ్డి

ఉయ్యాలవాడ: రాష్ట్రంలో రూ. 6,399 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణాలు చేపట్టినట్లు పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఉయ్యాలవాడ నుంచి కొండుపల్లె వరకు రూ. 9.50 కోట్లతో నిర్మిస్తున్న రహదారిని సీఈ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 4,367 కోట్లతో 10,917 సచివాలయ భవన నిర్మాణాలు చేపడుతుందన్నారు. వీటిలో 5,718 భవన నిర్మాణాలు పూర్తి కాగా రూ. 2,149 కోట్లు నిధులు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే రూ. 2,032 కోట్లతో 10,238 రైతు భరోసా కేంద్రాలు నిర్మించాల్సి ఉండగా, 3,887 కేంద్రాలు పూర్తి కాగా రూ. 940 కోట్లు నిధులు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మిగిలిన భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ పరిపాలన ధ్యేయంగా పని చేస్తున్నారనేందుకు నిదర్శనమే ఈ భవనాల నిర్మాణాలన్నారు. ఆయన వెంట ఈఈ రామమోహన్, డీఈ లక్ష్మీనరసింహుడు, చాగలమర్రి, ఉయ్యాలవాడ పంచాయతీరాజ్ ఏఈలు కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, విశ్రాంత పంచాయతీ రాజ్ ఏఈ కరీం బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



ఏడీజీపీ సీతారామాంజనేయులు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రసూల్

కోవెలకుంట్ల: ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా ఉత్తమ సేవలందించిన కోవెలకుంట్ల హెడ్‌కానిస్టేబుల్ దూదేకుల రసూల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. 74వ గణతంత్ర వేడుకల సందర్భంగా గురువారం విజయవాడలో ఇంటెలిజెన్స్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీతారామాంజనేయులు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రసూల్ ప్రస్తుతం స్పెషల్‌బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న రసూల్‌ను పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నర్సాపురం చేరిన పార్వేట పల్లకీ



నర్సాపురం గ్రామ శివారులోని తెలుపు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం: శ్రీ జ్వాలా నరసింహాస్వామి, శ్రీ ప్రహ్లాదవరద స్వామి వార్ల ఉత్సవ పల్లకీ గురువారం రాత్రి మండలంలోని నర్సాపురం గ్రామానికి చేరుకుంది. తిమ్మనపల్లెలో గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి వీడ్కోలు పలికారు. అక్కడి నుంచి పల్లకీని బోయిలూ నర్సాపురం గ్రామ శివారులోకి మోసుకు రాగా గ్రామ సర్పంచు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు మేళ తాళాలతో ఎదురేగి వెళ్లి విశేష పూజలు నిర్వహించి గ్రామంలోకి స్వాగతించారు.

ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీకి పదోన్నతి

కర్నూలు: ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీ గుండ్లమడుగు వెంకటరాముడుకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడుది వ్యవసాయ కుటుంబం. ఈయన 2012లో గ్రూప్-1 ద్వారా డీఎస్పీ హోదాలో పోలీసు శాఖలో చేరారు. మొదట గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా సేవలు అందించారు. నెల్లూరు టౌన్ డీఎస్పీగా, విజయవాడలో సీఐడీ విభాగంలో ఏడాది, ఆదోని డీఎస్పీగా ఏడాది పాటు పని చేశారు. 2019 జులై 26 నుంచి ఇప్పటివరకు కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీగా పని చేస్తున్నారు.

జెండా వందనం



లోకాయుక్త కార్యాలయంలో త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి

జాతిపితకు నివాళి



హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్ మాంధాత సీతారామమూర్తి

బహుమతుల ప్రదానం



గణతంత్ర పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థినికి జిల్లా కోర్టులో ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

డీఐజీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఐజీ సెంథిల్ కుమార్

కర్నూలు: బి.క్యాంప్‌లోని కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. డీఐజీ సెంథిల్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం గావించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి మిఠాయిలను పంపిణీ చేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఆర్‌డీఎస్పీ రియాజ్ బాషా, డీఐజీ కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

శకటాల ప్రదర్శన

పరేడ్ మైదానంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. గ్రామీణ నీటి సరఫరా శకటానికి ప్రథమ బహుమతి, సూక్ష్మ నీటి సాగు శకటానికి రెండవ బహుమతి, డీఆర్‌డీఏ, హౌసింగ్ శాఖ శకటానికి మూడో బహుమతికి ఎంపికైంది. ఎగ్జిబిషన్ స్టాళ్లలో డ్వామాకు ప్రథమ బహుమతి, డీఆర్‌డీఏకు రెండవ బహుమతి, స్త్రీ శిశు సంక్షేమం, విద్యా, పట్టుపరిశ్రమల స్టాళ్లకు మూడో బహుమతి లభించింది. విధుల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు ప్రశంసా పత్రాలు అందజేశారు.

క్లుప్తంగా

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రాజశేఖర్‌స్వామి మృతదేహం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో బుధవారం గల్లంతైన హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్‌స్వామి(27) మృతదేహం గురువారం 57వ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో లభ్యమైంది. ఈ యువకుడు కర్ణాటక రాష్ట్రం బెళగల్ వద్ద ఉన్న సూగూరులో ఈరమ్మ అనే యువతిని వివాహం చేసుకుని ఏడాది నుంచి అక్కడే నివాసం ఉంటున్నాడు. బుధవారం తన తల్లి సుమంగళమ్మ, మామ పంపాపతితో కలిసి సిద్ధాపురంలో తన అవ్వ దినకర్మ ముగించుకుని తిరిగి వెళ్తూ ఎల్లెల్సీలో నీరు తాగేందుకు దిగి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అతని ఆచూకీ కోసం పోలీసులు, బంధువులు కాలువ వెంబడి గాలించగా గురువారం కె బెళగల్ సమీపంలోని 57వ డిస్ట్రిబ్యూటరి పరిధిలో మృతదేహం లభ్యమైంది.

గో ప్రదక్షిణ ఎంతో పుణ్యం

కౌతాళం: గో ప్రదక్షిణతో ఎంతో పుణ్యం లభిస్తుందని రామలింగేశ్వర స్వామి పీఠాధిపతి పాల్తూరు చన్నవీర శివచార్య స్వాములు తెలిపారు. మండలంలోని మేళిగనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గోశాల నిర్మాణానికి రౌడూకుంద మఠం పీఠాధిపతి శివయోగి శివచార్యులతో కలిసి గురువారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామి ఆలయం అతి పురాతన పుణ్యక్షేత్రమని, పూర్వం రాముడు సీతదేవిని వెతుకుతూ మేళిగనూరులో సూర్యోదయ సమయంలో శివ లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. మేళిగనూరు, నదిచాగి గ్రామాల భక్తులు, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న పీఠాధిపతులు

అది చిరుత కళేబరమే

తేల్చిచెప్పిన ఫారెస్ట్, వెటర్నరీ అధికారులు

వెల్దుర్తి: యాపర్లపాడు ఫారెస్ట్ బీట్ పరిధిలోని సుబ్బయ్యతాత గుడి అవతల కొండల్లో గుర్తించిన కళేబరం రెండేళ్ల వయసు గల చిరుతపులిదని ఫారెస్ట్ అధికారులు, వెటర్నరీ అధికారులు తేల్చి చెప్పారు. గురువారం ఉదయం వెల్దుర్తి పశువైద్యాధికారి శాంతలత సంఘటనాస్థలికి చేరుకుని కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం కర్నూలు జిల్లా అటవీశాఖాధికారి పి శివ శంకర్ రెడ్డి, వైల్డ్ ఎనిమల్ కన్జర్వేషన్ ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధి శ్రీధర్, కర్నూలు రేంజ్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు అక్కడి చేరుకుని కళేబరం అవశేషాలు సేకరించారు. పోస్ట్‌మార్టం అనంతరం డీఎఫ్ఓ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ చిరుతపులి నెల క్రితమే చనిపోయినట్లు తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని అటవీ జంతువులు పీక్కుతిన్నట్లు అర్థమవుతోందన్నారు. శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపి మృతికి గల కారణాలు తెలుసుకోనున్నట్లు తెలిపారు. అన్ని రకాల పరీక్షల అనంతరం కళేబరానికి సంఘటనాస్థలంలోనే దహనక్రియలు పూర్తిచేశారు.


చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖాధికారి పి శివశంకర్ రెడ్డి

సేవలకు ప్రశంస

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు గణతంత్ర వేడుకల సందర్భంగా గురువారం పురస్కారాలు అందించారు. నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ చేతుల మీదుగా అవార్డు గ్రహీతలు ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు.

– నంద్యాల


కలెక్టర్ మనజీర్ జిలానీ, జాయింట్ కలెక్టర్ నిశాంత్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అవార్డు అందుకుంటున్న నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య


రమణ, అడిషనల్ ఎస్పీ; శ్రీనివాసులు, ఆర్‌డీఓ; అనురాధ, డీఈఓ; జఫ్రుల్లా, డీసీహెచ్ఎస్; జయరావు, డీపీఆర్ఓ డీడీ; వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్ఓ;
శ్రీధర్, డీఆర్‌డీఏ పీడీ; లీలావతి, ఐసీడీఎస్ పీడీ; ప్రసాదరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్; శ్రీనివాసులు, ఆర్ఎం; రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్; పరమేశ్వరి, సెరీ కల్చర్ అధికారి;
చింతామణి, సాంఘిక సంక్షేమ అధికారిణి; లక్ష్మీదేవి, ట్రెజరర్ ఆఫీసర్; జయన్న, జిల్లా అగ్నిమాపక అధికారి; శ్రీనివాసులు, డీపీఓ; ఆచార్యులు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి; శ్రీకాంత్, ఎంవీఐ;
శ్రీనివాసయాదవ్, జిల్లా పరిశ్రమల అధికారి; రమణారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ; రామ్మోహన్, పీఆర్ అధికారి; మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ; లలితాకుమారి, జేసీడీఓ; ప్రభావతి, డీఐఓ;
సతీష్, డిప్యూటీ తహసీల్దార్; రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్; విద్యసాగర్, తహసీల్దార్, డోన్; మహేశ్వరరెడ్డి, డీఎస్పీ; ప్రభాకర్‌రెడ్డి, సీఐ; నరసింహులు, సీఐ;
జయరాముడు, సీఐ; దస్తగిరిబాబు, సీఐ; ప్రియతంరెడ్డి, సీఐ; సుబ్బరాయుడు, సీఐ; పోతురాజు, సీఐ; శాంతకుమారి, ఎస్పీ కార్యాలయ సూపరింటెండెంట్;
జగదీశ్వరరెడ్డి, ఎస్ఐ; వాసు, ఇంటెలిజెన్స్ అధికారి; గోపాల్, ఫైర్ మెన్; వివేకానందరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్; మురహరిరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్; మహబూబ్ బాషా, డాక్టర్;
ప్రహ్లాద, ఏఎస్ఓ; రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఆళ్లగడ్డ; నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి; శమంతకమణి, ఐసీడీఎస్ పీడీ; విజయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్; కైజర్, డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ;
శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ డీఈఈ; జీశాన్, శానిటరీ సెక్రటరీ; శ్రీధర్, హార్టికల్చర్ ఆఫీసర్; రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ; గంగాధర్, పీఆర్ డీఈ; సుధాకర్, ఏడీఏ;
మల్లికార్జున, డీపీఆర్ఓ; చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి; ఉస్మాన్, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి; వెంకటరెడ్డి, ఆర్డీఓ, డోన్; ఎం.దాసు, ఆర్డీఓ, ఆత్మకూరు; సుధాకర్‌రెడ్డి, ఎండోమెంట్ అధికారి;
నాగరాజు, హార్టికల్చర్ జిల్లా అధికారి; మోహన్‌రావు, అగ్రికల్చర్ జేడీ; విజయ్‌కుమార్ ఎస్‌జీసీ; సురేఖ, ఆర్ఐ; హరినాథరావు, తహసీల్దార్, ఆళ్లగడ్డ; పుల్లయ్య, నంద్యాల డీఆర్ఓ;
ప్రసాద్, అటెండర్; ఎల్లయ్య, ఐకేపీ పీడీ; వెంగన్న, ఎంపీడీఓ; రాజేంద్ర, పీపీ; వాసుదేవగుప్త, ఎంపీడీఓ, బండిఆత్మకూరు; సుగణశ్రీ, ఎంపీడీఓ;
యాగంటప్ప, వ్యాఖ్యాత; మనోహర్ రాజు, తెలుగుగంగ ఈఈ; అబ్దుల్ రహిమాన్, మార్కెటింగ్ అధికారి; ఎంఏ రఫీక్, సబార్డినేట్; రామలీల, జూనియర్ అసిస్టెంట్; రఫి, కలెక్టర్ వాహన డ్రైవర్

20 రోజుల్లో పెళ్లి..

– రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు అరుణ్‌పాండు (ఫైల్)

ఆదోని అర్బన్: పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు మృత్యు ఒడి చేరాడు. మరో ఇరవై రోజుల్లో పెళ్లి ఉందనగా.. గుర్తు తెలియని వాహనం రూపంలో మృత్యువు కబళించింది. ఈ దుర్ఘటన గురువారం సాయంత్రం పెద్దహరివాణం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం గుడికంబాల గ్రామానికి చెందిన హేమాద్రి, రేణుక దంపతుల మొదటి కుమారుడు అరుణ్‌పాండు (24) శిరుగుప్పలోని ఓ ఫర్టిలైజర్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. రోజూ లాగే గురువారం కూడా విధులు ముగించుకొని గ్రామానికి వస్తుండగా.. పెద్దహరివాణం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా అరుణ్‌పాండుకు మద్దికెర గ్రామానికి చెందిన ఓ యువతితో పెళ్లి నిశ్చయమైంది. మరో 20 రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉంది. ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బ్యాక్‌వాటర్‌లో గుర్తుతెలియని మృతదేహం

పగిద్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత ప్రాతకోట శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పాత ప్రాతకోట సమీపంలోని శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు వీఆర్వో హరినాథ్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జున హుటాహుటిన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు సుమారు 24 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. నలుపు అడ్డగీతల బనియన్, బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్, చేతులకు ఎరుపు, తెలుపు దారాలు ధరించినట్లు గుర్తించామన్నారు. ఎవరైనా సమాచారం తెలిస్తే వెంటనే 9121101186, 9121101188కు ఫోన్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

రేపు ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: భారతీయ సనాతన వైదిక ధర్మం కోసం పనిచేసే సంస్థలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి ఒకే ఆలోచనతో ముందుకు సాగేందుకు లలితా పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం స్వామి పేర్కొన్నారు. గురువారం సమ్మేళనానికి సంబంధించి కరపత్రాలను పీఠంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాజకీయాలకతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో కేవలం ధార్మిక పరమైన విషయాలు మాత్రమే చర్చించడం జరుగుతుందన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ నుంచి కూడా స్వామీజీలు సమ్మేళనానికి హాజరై మార్గదర్శనం చేయనున్నారన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పీఠాధిపతులు నిత్యానంద భారతిస్వామి, సద్గురు నాగలింగ శివాచార్య శివజీవైక్య మఠం పీఠాధిపతులు సద్గురు యల్లప్పస్వామి, శ్రీరామిరెడ్డి తాత సంస్థాన్ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు దాసరి రామచంద్రారెడ్డి, కామధేను గోశాల వ్యవస్థాపకులు బి.శ్రీరాములు, హనుమాన్ దీక్ష గురువు రామాంజనేయులు, లక్ష్మీరెడ్డితో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ కరాటే, బాక్సింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అండర్–19 ఏపీ స్కూల్స్ గేమ్స్ జిల్లాస్థాయి కరాటే, బాక్సింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, జిల్లా కార్యాలయము : నంద్యాల
రైల్వేస్టేషన్ రోడ్, నంద్యాల.
e-mail: nandyal@gmail.com, సెల్: 8074592477.

ఆర్.సి.నెం.: Rc,CS2/96/2022 తేది : 21.01.2023

బహిరంగ వేలము ప్రకటన

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, నంద్యాల వారి ఉత్తర్వుల నెం. Rc,CS2/96/2022 తేది : 05.01.2023 ప్రభుత్వము వద్ద నిల్వ ఉన్న సుమారు 287.567 మెట్రిక్ టన్నుల సీజ్ చేయబడిన బియ్యమును సంబంధించి బహిరంగ వేలము వేయుటకు నిర్దేశించిన ప్రకారము ఈ క్రింద తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు గల బియ్యము వివరముల ప్రకారము బహిరంగ వేలము జరిపించుటకుగాను.

సీజ్ చేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్న మండల స్టాక్ పాయింట్లు:-
1) ఆళ్లగడ్డ - 34.430 2) ఆత్మకూరు - 56.370 3) రుద్రవరం - 12.770
4) నంద్యాల - 77.918 5) కోయిలకుంట్ల - 51.137 6) డోన్ - 45.195
7) ప్యాపిలి - 3.400 8) నందికొట్కూరు - 6.347
మొత్తం 287.567 మెట్రిక్ టన్నులు.

వేలం జరుగు ప్రదేశం : వీడియో కాన్ఫరెన్స్ హాల్ కలెక్టరేట్ నంద్యాల.
తేది : 04.02.2023, సమయం : సాయంత్రం 04.00 గంటలకు

నిబంధనలు : 1) బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా ధరావత్తు రూ. 1,00,000/-లు డి.డి. రూపంలో District Civil Supplies Manager APSCSCL, Nandyal వారి పేరున చెల్లించి తేది : 04.02.2023 సాయంత్రం 03.00 గంటలలోపు అర్హత పొందవలెను. 2) కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్ / రైస్ మిల్లర్ అయి ఉండవలెను. 3) వేలము ముగిసిన అనంతరము వేలం కోసం చెల్లించిన పైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని (Unsuccessful Bidder) కు డి.డి. తిరిగి ఇవ్వబడును. 4) బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారికి సరుకును స్వాధీన పరుచుట అనేది జిల్లా కలెక్టర్ / జిల్లా సంయుక్త కలెక్టరు, నంద్యాల వారి ఉత్తర్వులకు లోబడి ఉండును. 5) జిల్లా కలెక్టర్ / జిల్లా సంయుక్త కలెక్టరు, నంద్యాల వారు అనుమతించిన పిమ్మట 5 రోజుల లోపల పాటకు సంబంధించిన మొత్తం పైకము చెల్లించి సరుకును స్వాధీనపరచుకొనవలెను. స్వాధీన పరచిన సరుకును 10 దినములు లోపల రవాణా మరియు వినియోగము చేసుకొనవలెను. 6) వేలము వేయు సరుకును కొనుగోలుదారులు వేలము జరుపుటకు ముందు రోజులోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో తెలుపబడిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును. 7) బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్ / రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి 08 మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను. 8) ఈ బహిరంగ వేలం అనేది సంయుక్త కలెక్టర్ వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

ఇట్లు : సం/- నిషాంతి.టి, జాయింట్ కలెక్టర్ (పౌర సరఫరాలు), నంద్యాల.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.